క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం రైల్వేస్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. రైల్వే స్టేషన్ బోర్డులు కనిపించకుండా పెరిగిపోయిన చెట్ల కొమ్మలను తొలగించారు. అనంతరం రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న ట్యాక్సీస్టాండ్, ఆటో స్టాండ్ డ్రైవర్లతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవికాంత్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, చీఫ్ గూడ్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, రైల్వే పెన్షనర్ల సంఘ కార్యదర్శి కేవీవీ రావు, మాజీ కౌన్సిలర్ కురుకూరి సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక గాంధీ నగర్ వాటర్ ట్యాంకుల వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్‌వైఎస్‌కే ప్రసాద్ సోమవారం తెలిపారు. లయన్స్ క్లబ్, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పట్టణ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



పెద్దాపురం ఆర్డీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తహసీల్దార్‌కు సూచించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ శ్రీరమణిని సోమవారం పెద్దాపురం తహసీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంట డీటీ కాంతారావు, రాజు తదితరులు ఉన్నారు.

పెద్దాపురం ఎంవీఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)గా కె.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంవీఐగా బాధ్యతలు నిర్వహించిన విఠల్ పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు ఎంవీఐగా పని చేస్తున్న ప్రసాద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. తొలుత రాజమహేంద్రవరం ఎంవీఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన నూజివీడు, ఏలూరులో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో పని చేసిన అనుభవంతో కాకినాడ జిల్లా పెద్దాపురం పరిధిలో మరిన్ని సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్-1	దేవర
లలితా స్క్రీన్-2	సత్యం సుందరం
వీరభద్ర	దేవర
శోభా	భలే ఉన్నాడే
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్-1	దేవర
అనుశ్రీ స్క్రీన్-2	దేవర
విఘ్నేశ్వర	సత్యం సుందరం
పిఠాపురం	
అన్నపూర్ణ	మత్తు వదలరా 2
పూర్ణ	టూ షోస్ చెక్ లేట్
పూర్ణ 2	దేవర
శ్రీసత్య	దేవర
శ్రీవెంకటేశ్వర	దేవర
ఉప్పాడ	
శ్రీనివాస	మత్తు వదలరా 2

కూటమిలో కయ్యం !

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో ఆధిపత్య పోరు
- అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో జనసేన, టీడీపీ విడివిడిగా పోటీ
- గెలుపు బాటలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి



పిఠాపురం అర్బన్ బ్యాంకు



నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలిపల్లి రాంబాబు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. ఎప్పుడూ ఏకగ్రీవంగా జరిగే పిఠాపురం అర్బన్ బ్యాంకు ఎన్నికలు కూటమి నేతల కుమ్ములాటతో ఈసారి రసవత్తరంగా మారాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి కొనసాగుతున్న కూటమి ఆధిపత్య పోరుకు ఇప్పుడు అర్బన్ బ్యాంకు ఎన్నికలు వేదికగా మారాయి. ఎవరికి వారే తమ ప్రాబల్యాన్ని నిలుపుకోవాలన్న తపనతో వ్యూహాలు పన్నుతుండగా వైఎస్సార్ సీపీ గెలుపు ధీమాతో దూసుకుపోతోంది. డిప్యూటీ సీఎం ఇలాకాలో టీడీపీ, జనసేన ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడంతో విచిత్ర పరిస్థితి నెలకొంది. బ్యాంకు చరిత్రలో పిఠాపురంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన వ్యక్తి బ్యాంకు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవుతుంటారు. అలాంటిది ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా ఏకంగా ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో రెండు పార్టీలూ చైర్మన్ పదవి కోసం నువ్వానేనా అంటూ పోరుకు దిగడం పట్ల పట్టణ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోనున్న 2 వేల మంది

పట్టణంలో 1919లో బ్యాంకు స్థాపించబడింది. గతంలో కొంతమంది వ్యక్తులు చేసిన పనికి 2002లో బ్యాంకు లిక్విడ్ అయింది. మళ్లీ 2008లో బ్యాంకును సొసైటీగా మార్చి తెరిచారు. పిఠాపురం పట్టణంలోని ఐదు వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో వార్డులో 400 మంది సభ్యులు చొప్పున 5 వార్డుల్లోనూ 2 వేల మంది సభ్యులు ఉండగా వారంతా ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 2019లో వైఎస్సార్ సీపీ నేత బాలిపల్లి రాంబాబు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2008 తొలిసారిగా డైరెక్టర్‌గాను, రెండోసారి 2014లో ఏకగ్రీవంగా ఎన్నికై వైస్ చైర్మన్‌గా కొనసాగిన ఆయన ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్నారు.

ఒకటో వార్డు నుంచి ముగ్గురు

ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఐదుగురు సభ్యులను జనసేన పార్టీ ఐదుగురి సభ్యులను బరిలోకి దింపింది. ఒకటో వార్డు నుంచి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, మాజీ డైరెక్టర్ జనపరెడ్డి రాంబాబు, విళ్ల నాగబాబు పోటీలో ఉండగా రెండో వార్డ్ నుంచి చెల్లుబోయిన ప్రమీల, పుణ్యమంతుల సుబ్బారావు, మూడో వార్డు నుంచి చల్ల గనిబాబు, అద్దంకి వెంకటరమణ, నాలుగో వార్డ్ నుంచి ఆరుగుల ప్రసాదరావు, రాయవరపు తిరుమల రావు, ఐదవ వార్డ్ నుంచి పైలా శ్రీనివాసరాజు, మేళం రామకృష్ణ బరిలో ఉన్నారు. అక్టోబరు 6న ఎన్నికలు నిర్వహించడానికి బ్యాంకు ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ ఏర్పాట్లు చేస్తున్నారు.

కూటమి ఏర్పాటులో కీలకపాత్ర మహించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన నేతలు కలిసి ఒక నిర్ణయం తీసుకోలేకపోవడంతో రెండు పార్టీ మధ్య ఉన్న ఆధిపత్య పోరును మరోసారి బయట పడింది. గతం నుంచి రెండు పార్టీలకు చెందిన అదినాయకుల మధ్య సఖ్యత లేకపోవడం ఎవరికి వారే తామే పెద్ద అన్నట్టుగా వ్యవహరిస్తున్న తీరు ప్రస్తుత ఎన్నికలకు ఆద్యం పోశాయంటున్నారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన అర్బన్ బ్యాంకు ఎన్నికలు ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి. తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి ఈ ఎన్నికలను వినియోగించుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. దీనిలో భాగంగానే ఎవరికి వారే తమ అభ్యర్థులను బరిలోకి దింపారు. అటు టీడీపీ నేతలు ఇటు జనసేన నేతలు తమ తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని పావులు కదుపుతున్నారు. దీనిలో భాగంగా ఇటీవల నామినేషన్ల ఉపసంహరణలో ఎవరికి వారు తమకు ప్రత్యర్థులుగా ఉన్న స్వతంత్ర్య అభ్యర్థులను బరిలో నుంచి తప్పించే ప్రయత్నాలు చేశారంటున్నారు. ఏ విధమైన ఎన్నికలు లేకుండా నేరుగా తమ అభ్యర్థులను నిలిపి ప్రత్యర్థులు లేకుండా గెలిపించుకోవలసిన పవన్ కల్యాణ్ పట్టనట్టు వ్యవహరించడంతోనే టీడీపీ, జనసేన నేతలు పోటీకి సిద్ధమైనట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. జనసేన ఇన్‌చార్జ్, టీడీపీ అధికార ప్రతినిధి మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాలు, ఆధిపత్య పోరు ప్రస్తుతం అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో మరోసారి బయటపడింది. ఒకపక్క టీడీపీ, జనసేన మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థి మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు మాత్రం నాకెవరు పోటీ లేరు అన్నట్టుగా గెలుపే ధ్యేయంగా చాపకింద నీరులా తన ప్రచారాన్ని వేగవంతం చేశారు.

పంచారామ క్షేత్రంలో మాస శివరాత్రి పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపురసుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పుష్కరణిలోని నీటితో ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి అభిషేకాలు చేసుకున్నారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్ ఉప ఆలయాలు, స్వామి వారిని అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

మున్సిపల్ ఆదాయంపై దృష్టి సారించండి

- ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు

పెద్దాపురం: మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయంపై అధికారులు దృష్టి సారించాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ముప్పన శ్యామలాంబ మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ అద్దెల విషయంలో రెవెన్యూ అధికారుల పనితీరు దారుణంగా ఉందన్నారు. షాపుల అద్దె తగ్గింపుపై మాకు ఎటువంటి అభ్యంతరం లేదని, కాకపోతే 2019-22లో పెంచిన అద్దెలను కౌన్సిల్ ఆమోదంతో సవరణ చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ వాటిని సవరణ చేస్తూ కౌన్సిల్ ముందు ఉంచడం సరైనది కాదన్నారు. జరిగిపోయిన కాలానికి అద్దె సవరణలు చేస్తూ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశాన్ని వాయిదా వేసి, తదుపరి పూర్తి వివరణతో అద్దెల విషయంపై చర్చించాలని పట్టుబట్టారు. దీంతో ఈ అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు ప్రకటించారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో నిర్లక్ష్యం

పెద్దాపురం మెయిన్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఎన్నిసార్లు చెప్పినా అధికారులు నిర్లక్ష్యం కట్టొచ్చినట్లు కనిపిస్తోందని కౌన్సిల్ రాజశేఖర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో అపారిశుధ్యం, విషజ్వరాలు ఓ పక్కన విజృంభిస్తున్నా శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు తీరు అధ్వానంగా ఉందని మండిపడ్డారు. కౌన్సిలర్లు ఆకుల కృష్ణ బాపూజీ, పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలోని వీధి లైట్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పార్కునిర్వహణ తదితర సమస్యలపై అధికారులను నిలదీశారు. అనంతరం పలు ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



పిఠాపురంలో వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

పిఠాపురం: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. స్థానిక రథాలపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం మండల స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేసి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్లు, బియ్యం కార్డుల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, కేఎస్ఈజెడ్ భూమి ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణల తొలిగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు, ఆరోగ్యశ్రీ సేవలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై 206 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోపు పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఇట్ల కిషోర్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి జేడీ, ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- ప్రజాసమస్యలపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- గరంగరంగా పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

పిఠాపురం: సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలు ఎందుకు పెడుతున్నారంటూ పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు స్థానిక సమస్యలను ఏకరువు పెట్టారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, కనీసం రెండు రోజులకు ఒకసారి కూడా చెత్తను తీసుకువెళ్లే ట్రాక్టర్లు రావడం లేదని, ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోవడంతో ప్రజల రోగాల బారిన పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాటునీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు దెబ్బతినడంతో డ్రైనేజీ వాటర్ మున్సిపల్ కుళాయిల నుంచి వస్తుందని, దీనిపై ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి మాట్లాడుతూ స్థానిక రథాలపేటలో అంబేడ్కర్ భవనం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



విశ్రాంత ఉపాధాయుడు సుబ్బారావును సత్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులే అని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దడాల సుబ్బారావును సోమవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడిగా సుబ్బారావు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రావు చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌తో ప్రజా సమస్యల పరిష్కారం

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు 11 అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్-పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 11 అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులకు పీజీఆర్‌జీఎస్‌కు అందుబాటులో ఉంటారన్నారు. పీజీఆర్‌జీఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు 11 ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై గరంగరం

- పూడికతీత పనులతో ప్రజాధనం దుర్వినియోగం
- అధికారుల తీరుపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు
- సామర్లకోటలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



పూడిక తీత పనులపై అధికారులను నిలదీస్తున్న వైస్‌చైర్మన్ మోజెస్



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణ, కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: పూడిక తీత పనుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ ఆరోపించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. పూడిగ తీత పనులకు టెండర్లు వేయడంలో బెదిరింపులు వచ్చాయని, ఈ పనుల్లో కుంభకోణం ఉందని ఆరోపించారు. వర్షాకాలంలో పూడిక తీత పనులు చేయడం సరికాదని, అది కూడా డ్రైను మొదటి భాగం నుంచి కాకుండా చివరి భాగం నుంచి తీయడం వల్ల వర్షాలకు మళ్లీ పూడిక దిగువకే వెళుతుందన్నారు. పూడికతీతపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం సేకరిస్తామని కమిషనర్ ఎ.శ్రీవిద్య హామీ ఇచ్చారు. శానిటరీ వర్కర్ల కేటాయింపు సక్రమంగా లేదని, వార్డులకు వర్కర్లను పెంచాలని కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, సేపెని సురేష్ డిమాండ్ చేశారు. శానిటరీ వర్కర్లలో 10 మంది వేర్వేరు విభాగాల్లో పని చేయడం సరికాదన్నారు. దీనిపై టీడీపీ సభ్యుడు బలుసు వాసు, ఆవాల లక్ష్మీనారాయణ మధ్య వాగ్వాదం జరిగింది. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య విభాగానికి తీసుకున్న వారిని అదే విభాగంలో పని చేసే విధంగా చర్యలు తీసుకొవాలని ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు డిమాండ్ చేశారు. ఆయా విభాగాల్లో సర్దుబాటు చేసి చర్యలు తీసుకొంటామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు రెడ్నం సునీత, నేతల హరిబాబు, పితాని కృష్ణ, చిట్టుమాని రాఘవ, పాగా సురేష్, సేపెని సురేష్ ఆరోపించారు. పట్టణంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, వారం రోజుల్లో మార్పు కనిపిస్తుందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవహర్ రాజశేఖర్ హామీ ఇచ్చారు.

పని చేయని కాంట్రాక్టర్లపై చర్యలేవీ ?

పట్టణ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి టెండర్లు పిలిచారు. టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకపోయినా చర్యలు కనిపించడం లేదని వైస్‌చైర్మన్ మోజెస్, సభ్యులు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు ఆరోపించారు. కౌన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు గడుస్తున్నా తమ వార్డుల్లో పనులు పూర్తి కాలేదని, కొన్ని వార్డుల్లో పనులు ప్రారంభించ లేదని సభ్యులు మత్రి శేషారావు, నమ్మి సూర్యదుర్గ, స్వయంభారపు వీరభద్రరావు, రెడ్డి లోవకుమారి, సేపెని సురేష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకొంటామని కమిషనర్ తెలిపారు. నీలమ్మచెరువు వద్ద నరికేసిన చెట్ల కారణంగా వాకింగ్ చేయడానికి ఇబ్బంది కలుగుతోందని సభ్యులు రెడ్నం సునీత, చిట్టుమాని రాఘవ, నేతల హరిబాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో ఆక్రమణలు తొలగించాలని పితాని కృష్ణ, నేతల హరిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్మించిన ప్రతి ఇంటికి పన్నులు వేయాలని నేతల హరిబాబు, పాగా సురేష్ సూచించారు. బీపీఎల్ పథకంలో మంజూరైన ఇళ్లకు పన్నులపై ప్రభుత్వం నుంచి సమాచారం రావలసి ఉందని కమిషనర్ తెలిపారు. సాధారణ, అత్యవసర సమావేశాల్లో అంశాలను సభ్యులు ఆమోదించారు. కో ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, సలూరి కల్యాణ్, డీఈ ఎ.అనంతలక్ష్మి, టీపీఎస్ మంజుల, ఆర్వో కె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ వద్ద ఓఎన్‌జీసీ ప్రతినిధులు

సామర్లకోట: విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య సూచించారు. పట్టణపరిధిలోని ప్రభుత్వ హైస్కూల్‌కు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఓఎన్‌జీసీ సోషల్ రెస్పాన్స్ ఫండ్స్ నుంచి ఆర్వో ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు, ఓఎన్‌జీసీ చీఫ్ హెచ్ఆర్‌లు సాదబ్ అన్వార్, రవీంద్రనాథ్ ఆర్వో ప్లాంట్ పనితీరును వివరించారు. ఆర్వో పాట్లు మరమ్మతులకు గురైతే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీ ద్వారా జరుగుతున్న విద్యా బోధనను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.ప్రసూన, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మీనామాధురి, ఉపాధ్యాయులు జ్యోతి, నారాయణ, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా శ్రీనివాస్



సీపీఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సుబ్బలక్ష్మి

పెద్దాపురం: సీపీఎం వరహాలయ్యపేట శాఖ కార్యదర్శిగా సిరిపురపు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం నెక్కట నరసింహమూర్తి అధ్యక్షతన సీపీఎం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. వాటికి వంత పాడుతున్న కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నాలుగు వేల మంది కార్మికులను బయటకు పంపేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇసుక ఉచితమని చెప్పిన ప్రభుత్వం మొత్తానికి ఇసుక లేకుండా చేసిందన్నారు. ఇసుక లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొలుత సీపీఎం పతాకాన్ని సీనియర్ సభ్యులు రొంగల సుబ్బలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీలపాల సూరిబాబు, యాసలపు రమేష్, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, జి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.